కథా నిలయం
645
శ్రీకాకుళం

# బొమ్మలాట

ఎండ మొహాన పడుతుంటె మెలకువ వచ్చింది మంగమ్మకు. "ఏంటిది! ఇంత పొద్దోయినా మెలకువ రాలేదు. ఇయ్యాల ఆయన రిటైరైతే నానూ రిటైరయ్యానేంటి" అనుకుంది. తనకు రిటైరేంటి! బతికినన్నాళ్ళూ చెయ్యాల్సిందే! బిడ్డా పాపా ఉంటే-వాళ్ళు పెద్దోళ్ళయితే కొడుకులు, కోడళ్ళూ పెద్దతనంలో ఆదుకుంటారు. పనిబరువు తీరుతుంది. తనకేముంది! బిడ్డాపాపా లేరు. ఆయనా, తనూ, అంతేగా? ముప్ఫయ్యేళ్లు జవానుగా చేసి మరి నిన్ననే రిటైరయినాడు. ఇయ్యాలిటీనుంచి ఆయనకు రెస్టు. మరింక ఆఫీసుకెల్లక్కర్లేదు. తనకేం తప్పుద్ది? ఇల్లు ఊడవాలి, గిన్నెలు తోమాలి. గుడ్డలు పిండాలి. గింజలు తేవాలి, కూడుపండాలి. పొద్దున్నా సాయంత్రం ఈ గొడవ తప్పదు. అన్నింటికన్నా ముఖ్యం నీళ్ళు తెళ్ళాలి, బిందె పట్టుకు బావికాడ గంటలు గంటలు పడుంటునేగాని చేరెడు నీళ్ళు దొరకవు. బావిచుట్టూ జనమే! పాతికిళ్ళ కదొక్కటే బావి! కాస్సేపు బతిమిలాడి, కాసేపు జగడమేసి కాస్సేపు కాచుక్కూచుంటే, బిందెడు నీళ్ళు బయటపడతాయి. ఆ నీళ్ళు దెచ్చి ఇంటి పనిజేసి అన్నం పండేసరికి మిట్ట మధ్యాహ్నమవుతుంది. ఎంత వయస్సు వస్తే తనకు రెస్టు! అయినా ఇవాళ సంతోషంగానే ఉంది. ఆయన ఇంక ఇంటి పట్టునే ఉంటాడు. ఇన్నాళ్ళకయినా కాస్త ఒకరితో ఒకరు మాటా మంతీ ఆడుకుంటూ కాలక్షేపం చెయ్యొచ్చు!

ఆలోచించుకుంటూ కళ్ళు నులుపుకుంటూ లేచి పక్కకు చూసింది. పక్కమంచం మీద ఆయన లేడు.

"అదేమిటి! ఉద్యోగం ఉన్నప్పుడు ఏడయినా లేవడు ఇయ్యాళ పెన్షనయితె పెందలాడే లేచి పొయినాడు". అనుకుంది వింతగా! గదిలోనుంచి వరండాలోకి వచ్చింది. ఇక్కడ మారయ్య తదేక దీక్షగా ఏమిటో చేసుకుంటున్నాడు. వాడిగొడవేదో వాడిది. తిరిగైనా చూడలేదు. ఒక పెద్ద తాటాకు పళ్ళెం పెట్టుకున్నాడు. దాన్నిండా పువ్వులు పోశాడు. ఒక పెద్ద కొయ్యబొమ్మకు పసుపు గుడ్డ చీరలా కట్టాడు. ముఖానికి పసుపు పూశాడు. నుదుటి మీదకుంకుమ బొట్టు మెత్తుతున్నాడు. మంగమ్మకు నవ్వొచ్చింది.

"ఏందయ్యా! పెద్ద తనంలో బొమ్మలాట లాడుకోవాలని బుద్దేసిందేంటి! పపివాడివయిపోతన్నావ్!" అంది.

మారయ్య నవ్వలేదు. సీరియస్‌గా ముఖం పెట్టి అన్నాడు.

"బొమ్మలాట కాదే! ఇది బొమ్మకాదు అమ్మవారు. కాత్యాయనీ అమ్మవారు. అందరికోరికలు తీరుస్తుంది అడగడం తరవాయి. మరి నేను రిటైరయినాను గదా! ఇంక మనకు బువ్వెవరు పెడతారే! ఎక్కడనుంచి వస్తుందనుకున్నావ్? మనకేంకొడుకులు లేరుగదా, సంపాయించి పెట్టటానికి. ఆ గవర్నమెంటు పెన్షను డబ్బులు ఇప్పుడే వస్తాయనుకుంటున్నావా! అదెన్ని సంవత్సరాలు పడుతుందో! ఆ కాయితాలు అక్కడికి ఇక్కడికి తిరిగి తిరిగి డబ్బులు మనచేతికి వచ్చేటప్పటికి బతికుంటామో లేదో! ఈలోగా బువ్వెట్లా గడవాలి!"

మంగమ్మ కాస్త విచారంగా ముఖం పెట్టింది. మళ్ళా తరతరాలుగా వంటబట్టిన నిర్లిప్తతతో నమ్మకంతో అన్నది.

"ఆ! అందరికి బువ్వెవరు పెడుతున్నారు. ఆ దేవుడే ఏదో ఒకదోవ చూసిస్తాడు. ఆయినే బువ్వెడతాడు. ఏదో గడవక పోద్దా!"

మారయ్య అన్నాడు.

"అదేనే! దేవుడే దోవ చూపుతాడు. ఇయ్యాలిటినుంచి ఈ బొమ్మే మనకు దేముడు. పొద్దున్నే లేచి తీర్థానికెళ్లే దోవలో కూసుంటే వచ్చే పోయ్యే జనమంతా దండాలెడతారు. పైసా పరాకా వేస్తారు. సాయంకాలం దాకా కూసుంటే మనకు గడిచిపోద్ది. నువ్వూ రావే! వచ్చే పొయ్యే జనానికంతా అమ్మవారి మహిమ చెబుదువుగాని."

మంగమ్మ అంది.

"మరి ఇంట్లో పనెట్లా! అదెవరు చేస్తారు!"

"ఫరవాలేదు లేవే! మధ్యాహ్నం వచ్చి చేసుకుందువుగాని.! నువ్వూ వస్తే బాగుంటుందే. నేనూరికే కూచుంటాను, నువ్వందరికీ చెబుదువుగాని!" అన్నాడు మారయ్య.

"సర్లే! రేపట్నించి చూద్దాం! ఇయ్యాల రాలేను" అంది మంగమ్మ బద్ధకంగా!

కాస్సేపటికి మారయ్య తట్ట తీసుకుని తీర్థంవైపు వెళ్లాడు. బిందె తీసుకుని మంగమ్మ నీళ్ళకు వెళ్ళింది.

మధ్యాహ్నం భోజనానికి వచ్చినప్పుడు మారయ్య ముఖం ఉత్సాహంతో ఉప్పొంగుతోంది.

"చూడవే! పూటకు ఒక్క రూపాయి దొరికింది" అన్నాడు. తట్టలో చిల్లరడబ్బులన్నీ గుప్పిట్లోకితీసుకుంటూ మంగమ్మ సంతోషించింది. మర్నాడు తనూ వెళ్ళింది. చీకటితోనే భార్యాభర్తా లేచి వెళ్ళి తీర్థానికి దగ్గరగా చెట్టు కింద బొమ్మను పెట్టుకు కూర్చున్నారు. తీర్థానికి వెళ్ళే జనం దగ్గరగా వచ్చినప్పుడల్లా మారయ్య మంగమ్మను భుజంతో తట్టేవాడు. మొదట్లో మంగమ్మకు నోటమాట పెగల్లేదు. మారయ్య హెచ్చరిస్తున్నా, బిత్తరపోయి

చూస్తూ కూర్చునేది. క్రమంగా అలవాటైంది. ఎవరైనా అటువైపు వస్తే గొంతు సవరించుకుని పనస ప్రారంభించేది.

"అమ్మా! అయ్యా! అమ్మవారికి దండం పెట్టుకు వెళ్ళండి. అమ్మవారు మహాతల్లి! సాక్షాత్తు కాత్యాయని! దండం ఎట్టుకు ఒక కాసేసుకు ఎళ్ళండి. మీకు మేలు జరుగుద్ది మీరు కోరుకున్నవి జరిగితీరతాయి మర్నాటికే మీకు దాకలా కనిపిస్తుంది. అయ్యా! అమ్మా! ఒక్కసారి దయ చెయ్యండి."

ఎవరైనా పరధ్యానంగా, పొరపాటుగా ఈబొమ్మ చూడకుండా వెళ్ళినా, మంగమ్మ కేకలకు మళ్ళా వెనక్కు వచ్చి పైసా పావలా వేసి వెళ్ళేవారు. మధ్యాహ్నం దాకా ఉండి మంగమ్మ ఇంటికి వెళ్ళేది. ఎండవేళ వచ్చి భోజనం చేసి మారయ్య మళ్ళా వెళ్ళేవాడు. రోజూ సాయంత్రానికి రెండు మూడు రూపాయలు పోగయ్యేవి. వ్యాపారం బాగా సాగుతోంది. ఒకరోజు పొద్దున్నే ఒక ఆసామి వచ్చాడు. పొట్టిగా, లావుగా, గుండుగా, మరుగుజ్జులా ఉన్నాడు. కాస్త వయస్సు మళ్ళినట్టే ఉంది. దిగులుగా తీర్థానికి వెళుతున్న వాడు మంగమ్మ కేకలు విని మళ్ళా వెనక్కు వచ్చాడు. మంగమ్మ పనస ఒప్పచెప్పింది.

"అమ్మవారికి దండం పెట్టుకుంటే ఇంక అడ్డేలేదు. అనుకున్నది అయి తీరాల్సిందే" అంది.

ఆసామీకి ఆ మాటలు చాలా నచ్చాయి. భక్తితో వంగి నమస్కారాలు చేశాడు. పావలా కాసు అరటిపండు పళ్ళెంలో పడేశాడు. పెద్దగానే దండం పెట్టుకున్నాడు.

"అమ్మా! అనుకున్నవేవీ జరగటంలేదు, ఎన్నాళ్ళు చూసినా ఎక్కడా పిల్లదొరకటంలేదు. ఈ జనమకి పెళ్ళయే యోగం ఉందోలేదో!

అమ్మా! ఈ ఊరు మనువుకోసమే వచ్చాను. ఈ పిల్లగలోళ్ళు ఒప్పుకుని ఈ మనువు కుదిరిందా, సాయంత్రానికే వచ్చి రూపాయ బిళ్ళ సమర్పించు కుంటాను."

తదేక దీక్షతో, తదేక ధ్యానంతో ఆ ఆసామీ దండం పెట్టు కున్నాడు. చుట్టుపక్కల అందరూ వింటున్నారని కూడా అనుకోలేదు. చాలా సేపు దండాలు పెట్టుకుని నమస్కారాలు చేసి వెళ్ళాడు.

మారయ్య, మంగమ్మ ముఖముఖాలు చూసుకున్నారు. తాము పచ్చ గుడ్డ కట్టిన కొయ్యబొమ్మే కదా అది!

సాయంత్రానికి ఆ ఆసామీ మళ్ళా వచ్చాడు. మళ్లా సాష్టాంగ నమస్కారాలు చేశాడు. అమ్మవారికి పళ్ళ-పూలు, రూపాయి బిళ్ళా సమర్పించుకున్నాడు. దండం పెట్టుకున్నాడు.

"అమ్మా! నీ దయ! ఈసారి ఈ పిల్ల కుదిరింది. నీ మహాత్మ్యం. నా ప్రార్థన వృథా పోలేదు."

మారయ్యతోను ఇంకా అక్కడున్న వాళ్ళందరితోను చెప్పాడు "అమ్మవారు మంచి సత్తెం,మంచి మహత్యం అనుకున్నది అయితీరాల్సిందే. దండాలెట్టకుంటె వృథాపోదు."

ఈ మాటలు విని దూరాన పోతున్న వాళ్ళు కూడా దగ్గరగావచ్చారు. అందరూ దండాలు పెట్టుకున్నారు. ఆ రోజునుంచి మారయ్య రాబడి పెరిగింది. ఆ రోజు నించి కాత్యాయనీ అమ్మవారి మహాత్మ్యం వాడవాడలా వ్యాపించింది.

ఆ వేళ సాయంత్రం ఇంటికి వెళ్ళాక మారయ్య, మంగమ్మతో జరిగింది చెప్పాడు.

"ఆ ఆసామీకి మనువు కుదిరిందిట. మళ్ళా వచ్చాడు. రూపాయి బిళ్ళ వేశాడు. నిజంగా మన బొమ్మకి మంచి మహాత్యమే ఉందేమోనే! ఇంతకీ మన అదృష్టం" అన్నాడు.

మంగమ్మ కాస్సేపు ఆలోచించింది. నిదానంగా అంది.

"ఎందుకుండ గూడదూ! ఆవేళగుళ్ళో సాములారు చెప్పారుగా! రాయి రప్పా చెట్టు చేమా అంతా బగమంతుడే, కానిదేమీ లేదని! మనకి నమ్మకముంటే అంతా దేముడే! అన్నీ ఆయనేగా! నమ్మితే ఏదైనా జరుగుద్ది."

ఆ రాత్రి మంగమ్మ తాను మామూలుగా పూజ చేసుకునే వెంకటేశ్వరుని పటం ముందు కూర్చుంది. ఆ పటంకేసి చూస్తూ ఉంటే, ఆమె మనసులో ఒక ఆలోచన మెరపులా మెరసింది.

"ఓయి భగవంతుడా! మనషుల్నందరినీ బొమ్మలుగా చేసి నీ ఇష్టం వచ్చినట్లుగా ఆడుకుంటున్నావ్! నిన్నొక బొమ్మగాచేసి మేము రోజురోజూ నీతో ఆడుకుంటున్నాం! ఈ ఆటకి అంతం ఎప్పుడు."

మంగమ్మకు నీరసమూ నిద్రావచ్చాయి. ఆ వేళ ఏదో యథాలాపంగా మొగుడితో అంది.

"ఏం భయమూ, ఆ దేవుడే అన్నం పెడతాడు." అని. విచిత్రంగా ఇప్పుడా దేముడే తమకి బానిసయై అన్నంపెడుతూ ఉన్నాడు.

పచ్చగుడ్డ కట్టుకున్నది కర్ర బొమ్మా, కాత్యాయనా!